www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 24 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

శంకర్ దాదా పవర్‌లిఫ్టింగ్





- ప్రపంచ పవర్ లిఫ్టింగ్‌లో భద్రాద్రికి పతకాలు
- 73 ఏళ్ల వయస్సులో డివి శంకర్ రావు అసాధారణ ప్రతిభ
- బైపాస్ సర్జరీని అధిగమించి ప్రపంచ వేదికపై మెరిసి
- క్లాసిక్‌లో కాంస్యం... ఎక్విప్డ్‌లో రజతం
- ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు కైవసం

7 లో

సామాన్యుడిపై ధరాఘాతం..!




ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
-ఖమ్మం మార్కెట్‌లో కూరగాయల ధరలతో కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్

ప్రజాపక్షం/ తల్లాడ : నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో నన్న బియ్యం కిలో రూ. 80, కందిపప్పు కిలో రూ. 143, మినపప్పు కిలో రూ. 128, పెసరపప్పు కిలో రూ. 112, శెనగపప్పు కిలో రూ. 90, గుండు మిర్చి కిలో రూ. 420, పొడవు మిర్చి కిలో రూ. 290, కొత్తిమీర గింజలు కిలో 210 ఉన్నాయి. బియ్యం, పప్పు ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయాలంటేనే జేబుకు చిల్లు పడుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం ఆహార పదార్థాల కొనుగోలుకే ఖర్చు అవుతుండడంతో కుటుంబ బడ్జెట్ తలకిందులవుతుంది. ఖమ్మం మార్కెట్‌లో కూరగాయల ధరలు అయితే

మిగతా 2లో..

హైవే నిబంధనలకు తూట్లు..!

-గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ద్వి, త్రిచక్ర వాహనాలు





ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం దేవరపల్లి హైవే పై వరుసగా ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారుల్లో ఆందోళన కలుగుతుంది. స్వయం కృత అపరాధంతో పాటు చిన్న చిన్న పొరపాట్లు ఈ ప్రమాదాలకు కారణమవుతుండగా గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ద్విచక్ర వాహనాలకు, ఆటోలకు అనుమతి లేదు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం ప్రకారం నిర్దేశిత ప్రాంతాల వద్ద తప్ప వేరే ప్రాంతాల నుంచి హైవే మీదకు ప్రవేశించే అవకాశం లేదు. హైవేకు సంబంధించినటువంటి టోల్‌గేట్ల వద్ద నుంచే యథెచ్ఛగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణిస్తూ

మిగతా 2లో..

జిల్లాలో కరువు ఛాయలు..!





-రైతులకు కన్నీళ్లేనా..
-పత్తి, మిర్చి, వరి పంటలకు తీవ్ర నష్టం
-పరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపు

ప్రజాపక్షం/ఖమ్మం : వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు ఆశించిన దిగుబడులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి. పత్తి, మిర్చి, వరి సాగు చేసిన రైతులు పంటల పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. సాగు కోసం చేసిన అప్పులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు భారంగా మారడంతో తమను ఆదుకోవాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

17 మండలాల్లో కరువు ప్రభావం..
అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు

ఖమ్మం జిల్లాలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైన 17 మండలాలను ప్రాథమికంగా గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. వీటిలో 10 మండలాల్లో తీవ్ర కరువు, ఏడు మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రాథమిక అంచనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

మిగతా 2లో..

మహిళాభ్యుదయమే లక్ష్యంగా కార్యాచరణ



-33 శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం
-మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు పరిశ పద్మ
-డిసెంబర్‌లో మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/ ఖమ్మం : మహిళాభ్యుదయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జాతీయ నాయకురాలు పరిశ పద్మ పిలుపునిచ్చారు. మారిన సామాజిక పరిస్థితుల్లోనూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆమె ఆరోపించారు. తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో సన్నాహక సమావేశం శుక్రవారం స్థానిక వాసిరెడ్డి కళ్యాణ మండపంలో జరిగింది. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశ పద్మ మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య దేశంలో మహిళల హక్కుల కోసం, ఉపాధి కోసం, సంక్షేమం కోసం పోరాడుతుందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనూ మహిళా సమాఖ్య కీలక భూమిక పోషించిందన్నారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బహుముఖ పోరాటాలు చేసిన ఘనత ఎన్ఎఫ్ఐడబ్ల్యూకు దక్కుతుందన్నారు. ప్రస్తుత మోడీ ప్రభుత్వం రిజర్వేషన్లను ఆమోదించిన అమలు చేసేందుకు కొర్రీలు పెడుతుందని పద్మ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సాధించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. మోడీ ప్రభుత్వం మహిళల పట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తూనే వంటింటికి పరిమితం చేసే పనిలో ఉందని హిందూ ఛాందసవాదాన్ని మరల ప్రజల్లోకి తీసుకువచ్చి ప్రతి పనికి మతాన్ని చొప్పించి మహిళలకు బంధనాలు ఏర్పాటు చేసే పనిలో ఉందని ఆమె తెలిపారు. మహిళ చైతన్యమే లక్ష్యంగా పని చేయాలని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని అందులో ఉచిత బస్సు తప్ప ఏ హామీని అమలు చేయ లేదని ఆమె స్పష్టం

మిగతా 2లో..

సామాన్యుడిపై ధరాఘాతం..!

(మొదటిపేజీ తరువాయి) ముట్టుకునే పరిస్థితి లేదు. ఖమ్మం మార్కెట్‌లో కూరగాయల ధరల వివరాల ప్రకారం కిలో టమాట రూ. 40, బీన్స్ రూ. 80, క్యారెట్ రూ. 50, బెండకాయ రూ. 35, వంకాయ రూ. 40, క్యాప్సికం రూ. 55, పచ్చిమిర్చి రూ. 40, అల్లం రూ. 240, ఉల్లి పాయ రూ. 45, బంగాళాదుంప రూ. 20 చొప్పున నమోదయ్యాయి. కాలీఫ్లవర్ ఒక్కటి రూ. 45గా ఉంది. కూరగాయలతో పాటు పప్పులు, వంట నూనెలు, పాలు, చక్కెర వంటి నిత్యావసరాల కొనుగోలు కుటుంబాలకు అదనపు భారంగా మారుతుంది. తక్కువ ఆదాయం పొందే కార్మికులు, చిరుద్యోగులు, రోజు వారి కూలీలు నెలవారి ఖర్చులను సర్దుబాటు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు తక్కువ మొత్తంతో పూర్తయ్యే సరుకుల కొనుగోలు ఇప్పుడు అధిక వ్యయంతో కూడుకున్న వ్యవహారంగా మారిందని వినియోగదారులు చెబుతున్నారు. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులను పరిశీలించి వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసర వస్తువులు లభించేలా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నగరంలో కూరగాయల సరఫరా, హోల్‌సేల్, రిటైల్ ధరల మధ్య వ్యత్యాసాలు, నిల్వలు, రవాణా ఖర్చుల ప్రభావాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ధరల పర్యవేక్షణను పటిష్టం చేయడంతో పాటు రైతుబజార్ల ద్వారా సరసమైన ధరలకు కూరగాయలు అందుబాటులో ఉండేలా చూడాలి. ధరల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం, అక్రమ నిల్వలు లేదా అధిక ధరల వసూళ్లు ఉన్నాయా అనేది తనిఖీ చేయడం ద్వారా వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. నిత్యావసర ధరల భారం



తగ్గి సామాన్యుడి కుటుంబ బడ్జెట్ గాడిలో పడేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో బియ్యం , పప్పులు, వంట నూనె, చక్కెర, కూరగాయలు కొనుగోలు చేయడానికి కుటుంబాలు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. పల్లెల్లో వ్యవసాయ కూలీలు, రోజువారి కార్మికులు, చిరుద్యోగుల ఆదాయం పరిమితంగా ఉండటంతో పెరుగుతున్న ధరలు వారి కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. పట్టణాలతో పోలిస్తే కొన్ని గ్రామాల్లో రవాణా ఖర్చులు, దుకాణాల మధ్య పోటీ తక్కువగా ఉండటం వల్ల ధరల్లో వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉంది. గ్రామాల్లో రేషన్ సరుకులు సక్రమంగా అందించడం, రైతుబజార్ల తరహాలో తక్కువ ధరలకు కూరగాయలు అందుబాటులోకి తీసుకు రావడం, కిరాణా దుకాణాల్లో ధరల పట్టికలు ప్రదర్శించేలా తగు చర్యలు తీసుకోవడం అవసరం. సంబంధిత అధికారులు ధరలను పర్యవేక్షించి సామాన్యులకు ఉపశమనం కల్పించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో కరువు ఛాయలు..!

(మొదటిపేజీ తరువాయి) సమర్పించినట్లు నివేదికలు తెలిపాయి.

పత్తి దిగుబడిపై ఎల్‌నినో దెబ్బ :

జిల్లాలో ఈసారి 2,35,637 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు ఎల్‌నినో ప్రభావంతో పంట ఎర్రబారటం, పత్తి కాయలు సరిగ్గా ఎదగకపోవడం వంటి సమస్యల వల్ల ఎకరానికి ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. దీనితో పెట్టుబడులు తిరిగి వస్తాయా లేదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. మిర్చి, వరి రైతులు సైతం నీటి కొరత, పంటల ఎదుగుదలలో ఆటంకాలు, దిగుబడి తగ్గిపోవడం వంటి సమస్యలపై ఆందోళన చెందుతున్నారు.

నష్టపరిహారం అందించాలి : అన్నదాతల విజ్ఞప్తి

పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ ఉపశమనం కల్పించాలని రైతులు కోరుతున్నారు. కరువు ప్రభావిత మండలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు గ్రామాల వారీగా పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పత్తి, మిర్చి, వరి పంటల నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. పంట రుణాలు, వడ్డీల చెల్లింపుల విషయంలో రైతులకు తగిన వెసులుబాటు కల్పించాలని, పశువులకు మేత, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కరువు పరిస్థితులపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని నష్టపోయిన రైతులకు సాయం అందించే కార్యాచరణ ప్రకటించాలని అన్నదాతలు కోరుతున్నారు. సాగు కోసం అప్పులు చేసి పంటలు పండించిన రైతులకు సకాలంలో సాయం అందితేనే తదుపరి సాగుకు ధైర్యం వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

బైక్‌స్టంట్లు..యువకిడిపై కేసు నమోదు

- ప్రమాదకర విన్యాసాలకు పాల్పడితే చర్యలు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారులపై బైక్‌తో స్టంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యువకుడిని టూటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు. ఇందుకు సంబంధించి టూటౌన్ సిఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన వల్లూరు కృష్ణకిశోర్‌రెడ్డి తన బైక్‌పై నగరంలోని ప్రధాన రహదారులపై స్టంట్లు, విన్యాసాలు చేస్తూ తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాడని ఈక్రమంలో శుక్రవారం స్థానిక గట్టయ్య సెంటర్‌లో బండిపై ఫీట్లు చేస్తూ కనిపించడంతో పెట్రోలింగ్‌లో ఉన్న తమ సిబ్బంది పట్టుకుని స్టేషన్‌కు తరలించారన్నారు. అతనిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బైక్‌పై విన్యాసలు, రోడ్లపై కత్తులు, తల్వార్లుతో ప్రదర్శనలు, పుట్టిన రోజు వేడుకలు చేయడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసునమోదు చేస్తామని హెచ్చరించారు. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్, సిసిఎస్, స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసుల సమన్వయంతో రాత్రి వేళల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే చర్యలు...

బైక్‌పై ఫీట్లు చేస్తూ వాటిని వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టులు చేసినా వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులవుతారిని వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల కదలికలపై దృష్టి సారించాలని సూచించారు. క్షణికావేశంలో చేసే సాహసాలకు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని దానిని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడిపే యువత ప్రవర్తించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు ఉల్లఘిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎవరైన ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు, 112 సమాచారం అందించాలని సిఐ రామకృష్ణ ప్రజలకు విజ్ఞాప్తి చేశారు.

బీమా భరోసా, సైబర్ మోసాలపై హెచ్చరిక

ప్రజాపక్షం/అశ్వాపురం : అర్హులైన ప్రతి ఒక్కరూ జన సురక్ష బీమా పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి సూచించారు. ఎస్‌బీఐ అశ్వాపురం శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశరావు అధ్యక్షత వహించగా, ఎస్‌బీఐ శాఖ మేనేజర్ గోపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ 20 ప్రీమియంతో, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ 436 ప్రీమియంతో నిబంధనల ప్రకారం రూ 2లక్షల వరకు బీమా రక్షణ పొందవచ్చని వివరించారు. అర్హత, బీమా నిబంధనలు తెలుసుకుని పథకాల్లో చేరాలని సూచించారు. ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని, సైబర్ ఆర్థిక మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి యాకూబ్, ఎస్‌బీఐ అధికారులు, గ్రామ పంచాయితీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హైవే నిబంధనలకు తూట్లు..!

(మొదటిపేజీ తరువాయి)

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రయ్ రయ్ మంటూ పరుగులు పెడుతున్నాయి. గత కొంత కాలంగా ఇలానే జరుగుతున్న దీనిపై కొందరు ఫిర్యాదు చేసినా హైవే అథారిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. అసలే వరుస ప్రమాదాలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న వేళ ఈ ద్విచక్ర వాహనాలు, ఆటోల ప్రయాణం మరిన్ని ప్రమాదాలకు కారణమవుతుందన్న ఆందోళన నెలకొంది. ఈ విషయమై టోల్‌గేట్ల సిబ్బందిని ప్రశ్నిస్తే వారు హైవే నిర్మాణ పనుల్లో ఉన్నవారని తప్పించుకునే విధంగా మాట్లాడుతున్నారు. హైవే అథారిటీ పనులు చేసే వారికి ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ ఉంటుంది. హైవే అథారిటీ వాహనాల్లోనే ప్రయాణించాలి కదా అని ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పడం లేదు. మొత్తానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని గ్రీన్‌ఫీల్డ్‌పై ద్విచక్ర వాహనాలను, ఆటోల ప్రయాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

మహిళాభ్యుదయమే లక్ష్యంగా కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి) చేశారు. కళ్యాణలక్ష్మి , తులం బంగారంతో పాటు నెలకు రూ. 2500 మహిళల ఖాతాల్లో జమ చేస్తామన్న ప్రభుత్వం ఎందుకు జమ చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలు కోసం మహిళా సమాఖ్య పోరాడతాయన్నారు.

డిసెంబర్‌లో రాష్ట్ర మహాసభలు :

తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో ఖమ్మంలో జరగనున్నాయి. పోరాటాల పురిటిగడ్డ ఖమ్మం నగరంలో రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. సన్నాహక సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నేల సృజన, నెదునూరి జ్యోతి, రాష్ట్ర నాయకులు పోటు కళావతి, సదా లక్ష్మి , జయలక్ష్మి , ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మికుమారి, సిపిఐ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్‌పాషా, ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు దొండపాటి రమేష్, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు నల్ల మోతు శైలజ, దండి శ్రీజ, మునిగడప లక్ష్మి , కాంగ్రెస్ నాయకురాలు గాదెల ఝాన్సీ, మునిగడప పద్మ, బానోత్ కళావతి, శాంతిప్రియ, హరిత, సహరాబేగం పాల్గొన్నారు.

26న ఛలో హైదరాబాద్ మహా ధర్నా

ప్రజాపక్షం/ములకలపల్లి: కార్మిక హక్కులు పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని, ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుబ్బా ధన లక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం ములకలపల్లి మండల కేంద్రంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నిమ్మల మధు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ 42వేలకు పెంచాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న వారిని ముందస్తు అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న నిర్వహించే మహా ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కురం నాగలక్ష్మి , మాణిక్యమ్మ, నాగమణి,జ్యోతి, మీనా, పావని, లాల్‌బీ, శైలజ, కుమారి, పార్వతి, పద్మ, రోషమ్మ, తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానేశ్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలి

-ఇల్లందులో ప్రజాసంఘాల రాస్తారోకో

ప్రజాపక్షం/ఇల్లందు: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలించాలని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియలో తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లందు పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు జగదాంబ సెంటర్‌కు చేరుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆలేటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను బర్తరఫ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా తొలగించారని వారు పేర్కొన్న 13 కోట్ల ఓట్లను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వాసం రాము, తాళ్లూరి కృష్ణ, టీపీఎస్‌కే నాయకులు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మన్యం మోహన్‌రావు, సుల్తానా, ఐద్వా మండల అధ్యక్షురాలు మునిగంటి లక్ష్మి , మాదారపు వెంకటేశ్వర్లు, ఆవాజ్ జిల్లా నాయకులు షేక్ ఖాదర్, సలీం, రేష్మా, ఎం కోటమ్మ, వీరభద్రం, జ్యోతి, హుస్సేని, అమీనాబీ, గోరిబీ, ఎస్తేరు, తదితరులు పాల్గొన్నారు.



జనగణనతోనే దేశ ప్రగతి : కలెక్టర్



-ముగిసిన జనగణన శిక్షణా తరగతులు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జనగణన 2027 ప్రక్రియ దేశ ప్రగతికి, అభివృద్ధి ప్రణాళికల సమర్థవంతమైన రూపకల్పనకు ఎంతో కీలకమైందని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి దివాకర టిఎస్ తెలిపారు. ఖమ్మం నగరంలోని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ (డిపిఆర్సి) భవనంలో జిల్లా, డివిజన్, చార్జ్ స్థాయి అధికారులకు రెండు రోజుల పాటు నిర్వహించిన జనగణన ఫేజ్2 శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 2027లో ప్రారంభం కానున్న జనాభా లెక్కల సేకరణ విధులను అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దిష్ట గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయి విధుల నిర్వహణలో ఏమైనా సందేహాలు తలెత్తితే ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ద్వారా నివృత్తి చేసుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. హైదరాబాద్ సెన్సస్ డైరెక్టరేట్ కార్యాలయం నుండి ముఖ్య శిక్షకులుగా విచ్చేసిన అధికారులు హిమవర్ష, రాజు అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో సేకరించాల్సిన వివరాలు, ఫారాల నమోదు విధానం, మొబైల్ యాప్, పోర్టల్ వినియోగం, చార్జ్ రిజిస్టర్ల నిర్వహణ తదితర సాంకేతిక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక విభాగాధికారులు, జిల్లా, డివిజన్, చార్జ్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి



-ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలి
-సమన్వయ సమావేశంలో అధికారులు

ప్రజాపక్షం/రఘునాథపాలెం : ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వాడుకుంటూ ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలని రైతులకు అధికారులు సూచించారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదికలో వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏడిఈ ఎం. యాదగిరి, ఇరిగేషన్ డిఈ జి. మోతీలాల్ లు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే పెసర, నువ్వులు, మినుములు, కూరగాయలు, పశుగ్రాసం వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మంచుకొండ లిఫ్ట్ ద్వారా వ్యయ ప్రయాసలకొర్చి చెరువుల్లోకి చేర్చిన నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెరువుల నుంచి మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, తూముల ద్వారా కానీ నీటిని తోడి మొక్కజొన్న వంటి అధిక నీటి వినియోగం అవసరమయ్యే పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. చెరువుల్లోని నీటిని సాగునీటి అవసరాలు, పశువుల తాగునీటికి వినియోగించడం జరుగుతుందన్నారు. చెరువుల్లో నీరు అడుగంటితే బోర్లు, బావుల్లో కూడా భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్ శాఖల సిబ్బంది సమన్వయంతో గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం ఏవో కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, కామేపల్లి, ఖమ్మం అర్బన్ ఏవోలు, ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎస్బిఐటిలో ఇల్యూమినేట్ వర్క్ షాప్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యార్థులలో నూతన ఆవిష్కరణలు, వ్యాపార ధృక్పథం, స్టార్టప్ల స్థాపనపై అవగాహన పెంపొందించేందుకు జాతీయ స్థాయి ఎంటర్ప్రెన్యూర్షిప్ ఇల్యూమినేట్ వర్క్ షాప్ నిర్వహించినట్లు ఎస్బిఐటి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్ సెల్ స్పార్క్, ఇసెల్ ఐఐటి బాంబే, నేషనల్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ఛాలెంజ్ సంయుక్తంగా నిర్వహించిన ఇల్యూమినేట్ జాతీయ స్థాయి వర్క్ షాప్ను గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రముఖ ఐఐటి హైదరాబాద్, బిట్స్ పిలానీ, ఎంటర్ప్రెన్యూర్షిప్ మెంటర్ బండారు నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ఆసక్తి పెంపొందించడం, వినూత్న ఆలోచనలను ఆచరణాత్మక వ్యాపార అవకాశాలుగా మార్చుకోవడం, స్టార్టప్ల స్థాపనకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ వర్క్ షాప్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు సాంప్రదాయ ఉద్యోగ అవకాశాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి, ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని నవీన్కుమార్ సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా।। ధాత్రి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, బృంద స్ఫూర్తితో పనిచేయడం, సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవడం వంటి అంశాలపై అవగాహన పొందెందుకు ఈ వర్క్షాప్ దోహదపడుతుందన్నారు. నవీన్కుమార్ సూచనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని వైస్ చైర్మన్ శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్కుమార్ మాట్లాడుతూ నేటి ఆవిష్కరణలన్ని ఒకప్పటి ఆలోచనల నుండి ఉద్భవించినట్లు తెలిపారు. సరైన ఆలోచనలను పదునుపెడితే సమాజాభివృద్ధికి దోహదపడే అవకాశాలుగా మారుతాయన్నారు. అనంతరం వర్క్షాప్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యూబేషన్ సెల్ బాధ్యులు అశ్వని, జి. ప్రియాంక, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎంఎల్సీ ఓటు నమోదు కేంద్రాన్ని శుక్రవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి సర్వోత్తమరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావంతులకు, నిరుద్యోగులకు ఎన్నో పథకాలు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. సర్వోత్తమరెడ్డి లాంటి ఉద్యమకారుడు, విద్యావంతున్ని గెలిపిస్తే శాసన మండలిలో పట్టభద్రుల సమస్యలను వినిపిస్తాడన్నారు. అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సంజీవరెడ్డి భవన్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రంలో పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. కాంగ్రెస్ మండల, పట్టణాధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యుఐ, సేవాదళ్ నాయకులు ప్రతి గ్రామంలో, కళాశాలల్లో, ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువతను కలిసి ఓటు నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. సర్వోత్తమరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ కుమార్, నాయకులు రంగా జనార్ధన్, కోసూరి శ్రీనివాస్, వేల్పుల మురళీ, మద్దినేని రమేష్, దామా స్వరూప, జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు ఆసీఫ్, క్రాంతి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలన



ప్రజాపక్షం/పెనుబల్లిః పెనుబల్లి మండలంలోని లంకపల్లి, వి.ఎం. బంజర గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఫారం18 ప్రత్యేక నమోదు శిబిరాన్ని, బూత్ స్థాయి అధికారులు చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కోసం చేపడుతున్న చర్యలను, అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారి నుంచి ఫారం18 దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును సమీక్షించారు. అర్హత కలిగిన పట్టభద్రులందరికీ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులకు సూచించారు.

15వ బెటాలియన్లో ఘనంగా రక్తదాన శిబిరం



ప్రజాపక్షం/సత్తుపల్లిః పోలీస్ ఫ్లాగ్ డే2026 వేడుకల్లో భాగంగా బి. గంగారంలోని 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్లో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ బి. వినాయకరావు, సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పి. స్రవంతి, వైద్య సిబ్బంది, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

మార్పు కోసం కలిసి రావాలి

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బ్రదర్ షఫీ



ప్రజాపక్షం/సత్తుపల్లిః ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మోటివేషనల్ స్పీకర్, సైకియాట్రిస్ట్ బ్రదర్ షఫీవుల్లా (బ్రదర్ షఫీ) వెల్లడించారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని జామే మసీదు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నవంబర్ 6 తో ఓటరు నమోదు గడువు ముగియనున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదుపై అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం, ఎన్నికల ద్వారా మార్పు సాధ్యమనే నమ్మకం లేకపోవడంతో చాలామంది వెనుకంజ వేస్తున్నారని పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి, వారి గొంతుకగా నిలవడమే తన లక్ష్యమన్నారు. విద్యావ్యవస్థలో మెరుగైన మార్పులు తీసుకురావడంతో పాటు పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బ్రదర్ షఫీ పేర్కొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్లో పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్ సూచనల మేరకు భూక్యా అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎనిమిదవ డివిజన్ పరిధిలోని గోపాలపురం, ఎల్బి నగర్, వైఎస్ఆర్ కాలనీ, బాలపేట తదితర ప్రాంతాల్లో పట్టభద్రుల పాత ఓటరు లిస్టులో ఉన్న ఓటర్లకు ఫోన్ చేసి ఓటు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. గతంలో పట్టభద్రుల ఓటు ఉన్న మరల ఓటును నమోదు చేసుకోవాలని అందుకు అవసరమైన సహకారం అందిస్తామని అశోక్కుమార్ పట్టభద్రులకు తెలిపారు. నవంబర్ ఆరు వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు ఆపాలి



ప్రజాపక్షం/సత్తుపల్లిః స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా సమాజంలో కులవివక్ష తొలగడం లేదని, పండుగల సమయంలోనూ దళితులపై వివక్ష కొనసాగడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ నాయకుడు గోళ్లమూడి శ్రీనివాసరావు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సత్తుపల్లిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో దళిత మహిళలను బతుకమ్మ వేడుకల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం, కులం పేరుతో అవమానించడం వంటి ఘటనలను ఖండించారు. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలపై దృష్టి సారించి, దళితులపై దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ పండుగలు జరుపుకునే స్వేచ్ఛ, సమాన గౌరవం కల్పించాలని కోరారు. బతుకమ్మ పండుగ సమానత్వం, సోదరభావం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సత్తుపల్లి మండల ప్రధాన కార్యదర్శి పరిగడుపు లక్ష్మణ్ మాదిగతో పాటు సింగపోగు వెంకటేశ్వరరావు, తడికమల్ల కృష్ణయ్య, గద్దల బాబురావు, అలవాల మహేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఇండోర్ స్టేడియం

-లక్షలాది రూపాయలు వృథా





ప్రజాపక్షం/ ఖమ్మం : క్రీడాకారుల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిరూపయోగంగా మారింది. స్టేడియంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు ఎవరు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. మధిర నియోజక వర్గంలోని చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో రెండు కోట్ల రూపాయలు వెచ్చించి ఇండోర్ స్టేడియంను నిర్మించారు. ఎంతో ఉన్నత ఆశయంతో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో నిర్మించిన ఇండోర్ స్టేడియంకు ఆ తర్వాత నిధులు కేటాయించకపోవడంతో ఎటువంటి పనులు చేపట్టలేదు. దీనితో భవనం నిరూపయోగంగా మారింది. పక్కనే ప్రభుత్వ విద్యాలయం ఉండటం, సమీప గ్రామాలకు అందుబాటులో ఉండడంతో ఎంతో మంది క్రీడాకారులను ఈ స్టేడియంలో శిక్షణ పొంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశించారు. కానీ స్టేడియంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కొంత మంది గుత్తేదారులు తమ యంత్రాలను ఇక్కడ ఉంచేందుకు స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. లోపల ఇండోర్ స్టేడియంలో కొంత మంది తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకున్నారు. ఇప్పటికైనా ఇండోర్ స్టేడియంలో పూర్తి స్థాయి వసతులు కల్పించి క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా దానిని తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ముత్యాలగూడెం కాటమయ్య గుడి వద్ద విద్యుత్ వెలుగులు

-మంత్రి పొంగులేటి చొరవతో సత్వరమే పనులు పూర్తి

-విద్యుత్ అధికారులకు గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుల అభినందనలు



ప్రజాపక్షం/కూసుమంచి: ముత్యాలగూడెం గ్రామంలో కాటమయ్య గుడి వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు పనులు సత్వరమే పూర్తయ్యాయి. గుడి వద్ద విద్యుత్ సదుపాయం లేక భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సమస్య పరిష్కారమైంది. గురువారం విద్యుత్ పనులు పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గుడి వద్ద విద్యుత్ సదుపాయం కల్పించేందుకు సుమారు అర కిలోమీటరు మేర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, తీగలు లాగి వీధి దీపాలను అమర్చారు. అయ్యప్ప భక్తుల పూజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు వేగంగా స్పందించి పనులు పూర్తి చేయడంపై గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో పాటు ఆయన వ్యక్తిగత సహాయకుడు తంబూరి దయాకర్‌రెడ్డి, పాలేరు ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమ్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి చొరవతో విద్యుత్ పనులు త్వరగా పూర్తయ్యాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యుత్ పనులు పూర్తి చేయడంలో చొరవ చూపిన ఏడీఈ వెంకట్, ఏఈ మహమ్మద్ అక్బరుద్దీన్, జేఎల్‌ఎం ఎం శ్యామ్‌లను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు మంకెన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పేరెల్లి అశోక్, ఉప సర్పంచ్ పాసిని ప్రభాకర్, అయ్యప్ప భక్తులు, గ్రామ ప్రజలు అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తే సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తుందని వారు పేర్కొన్నారు.

వెట్టి చాకిరి విముక్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : సమాజంలో వెట్టిచాకిరీ బానిసత్వం వంటి అమానవీయ దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో కార్మికశాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలవంతంగా పనులు చేయడం, శ్రమకు తగిన వేతనం చెల్లించకపోవడం కార్మికుల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని శ్రమదోపిడీకి పాల్పడటం వంటి చర్యలను అరికట్టాలను సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్వేచ్ఛాధనం రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమం ద్వారా వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడం వారికి చట్టపరమైన రక్షణ కల్పించడం పునరావాసం అందించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇటుకబట్టీలు అక్వాకల్చర్ గనులు క్వారీలతో పాటు ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత రంగ కార్మికులకు ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వెట్టిచాకిరీకి గురవుతున్న వారు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సహాయం కోసం 08069434343 హెల్ప్‌లైన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమీషనర్ శ్యామల ప్రమోద్ కుమార్ జిల్లా ఉపాధికల్పన అధికారి కే శ్రీరామ్ సహాయ కార్మిక అధికారులు బి నాగరాజు పివికే శాస్త్రీ ఎ ఏసుపాదం రజిత సహిఎచ్‌టిఓ బృందం ప్రచార సాధకులు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయకండి

ఇంకుడు గుంతలను పరిశీలించిన డిఅర్డిఏ పీడీ విద్యా చందన

ప్రజాపక్షం/జూలూరుపాడుః



జూలూరుపాడు గ్రామం పంచాయతీలో ఇంకుడు గుంతల పనులను డిఆర్డిఎ పిడి. విద్యా చందన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 5600 ఇంకుడు గుంతలు సోప్ పిట్స్ మజూరు తెలిపారు. ఎల్ నినొ కారణంగా భూమిలో నీరు తగ్గిపోతుందని ఈ పరిస్థితిని అధిగమించాలంటే డాబాలపై కురిసే వర్షపు నీరు కానీ ఇండ్లలో ఉపయోగించుకునే నీరు బాత్రూంలో వృధాగా పోయే నీళ్లను వృధా చేయకుండా ఇంకుడు గుంతలను ఉపయోగించుకొని భూమిలోకి పంపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రై బోర్ వెల్స్ సంబంధించి ఎక్కడైనా సమస్యలు ఉంటే విజిజి రాంజీ 35 వేల రూపాయలు మంజూరు చేస్తున్నామని, అదే విధంగా సోప్ ఫిట్స్ కూడా 6,500 వీజీ రాంజీ పథకం ద్వారా మంజూరు చేస్తున్నామని ఈ పథకాలు రైతుల ఉపయోగించుకోవాలని సూచించారు.

కార్యదర్శులు సకాలంలో విధులకుహాజరు కావాలి...

జూలూరుపాడు మండలంలో ఫారం ఫాండుల ప్రోగ్రెస్ తక్కువగా ఉందనీ మండల వ్యాప్తంగా 64 మంజూరు అయితే ఇప్పటివరకు 22 మాత్రమే పూర్తి అయ్యాయని అవి త్వరగా పూర్తి చేసేందుకు సర్పంచులు మరియు కార్యదర్శులు శ్రద్ధ వహించాలన్నారు రైతుల్లో ఫారం పాండ్‌ల వల్ల ఎక్కువ భూమికి నష్టం జరుగుతుందని అపోహ ఉందని అలాంటిది ఏమీ చేయలేదని 2 లేదా 3 కుంటలు భూమి అయితే సరిపోతుందని అన్నారు.

రామచంద్రునిపేటలో వైద్య శిబిరం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామచంద్రునిపేట గ్రామంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన డైడే ఫైడే కార్యక్రమంతో పాటు ర్యాపిడ్ ఫీవర్ సర్వేను ఆయన పరిశీలించారు. శిబిరంలో 36 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో ఒకరికి జ్వరం ఉండటంతో ర్యాపిడ్ డయాగ్నస్టిక్ పరీక్ష(ఆర్‌డీటీ)నిర్వహించి సాధారణ జ్వరంగా నిర్ధారించి మందులు అందించారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేపట్టారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ టీ బాబూరావు, హెల్త్ సూపర్‌వైజర్ జీడీఎలోవో సాగర్, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, ఏఎన్‌ఎం రామలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ రీసర్వే, ఎంఎల్‌సీ ఓటరు నమోదుపై అవగాహన



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో భూ రీసర్వే, వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సీ ఓటరు నమోదుపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భూ రీసర్వేలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకాలు, భూమికి సంబంధించిన ఆధారాలు, ఆధార్ జిరాక్స్ ప్రతులతో నిర్ణీత ప్రదేశానికి హాజరుకావాలని అధికారులు సూచించారు. తమ భూముల హద్దులను అందరి సమక్షంలో చూపించి సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులు గడువులోగా దరఖాస్తు సమర్పించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమాల్లో తహసీల్దార్ డి సైదులు, మండల వ్యవసాయ అధికారి ఆర్ వాణి, మండల గిర్దావర్ రాము, సర్వేయర్, జీపీఓలు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు, చేగొమ్మ, ముత్యాలగూడెం గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఓటు నమోదుపై అవగాహన



ప్రజాపక్షం/ములకలపల్లి: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ములకలపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఫారం 18 అందజేశారు. అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ, నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టభద్రుల ఓటరు నమోదుకు చివరి తేదీ 2026 నవంబర్ 6 అని నాయకులు తెలిపారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం తప్పని సరిగా కొత్తగా మళ్లీ నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ గడువులోగా ఫారం 18 ద్వారా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు బండి కొమరయ్య, పుష్పాల చంద్రరావు, సున్నం బాబూరావు, పుష్పాల సాయి, హను మంతరావు, నల్లబెల్లి వెంకటేశ్వర్లు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలోని చండ్రుకుంట గ్రామంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఈవిషయంపై స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొర్సా రాజులు(28) శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగినట్లు సమాచారం. అనంతరం మధ్యాహ్నం సమయంలో మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై స్పష్టత లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి భార్య వెంకటమ్మతో పాటు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న యువకుడు మృతి చెందడంతో భార్యాపిల్లలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజులు మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐఖ్యపోరాటాలు



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రధాన ఎన్నికల సమీషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష ప్రజా సంఘాల ఐఖ్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేత్కర్ సెంటర్ అమర వీరుల స్తూపాల వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. సిఐటియూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి ఏఐటియూసి నాయకులు మారెడ్డి శివాజీ పిడిఎస్‌యూ నాయకులు శివప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల సంఘాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటోందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో కోట్లాది మంది ఓట్ల తొలగింపు అప్రజాస్వామికం అన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థల పరిరక్షణకు వామపక్ష ప్రజాసంఘాలు ఐఖ్యంగా పోరాడాలని పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి డి సీతాలక్ష్మీ జీవనజ్యోతి సున్నం గంగ కుంజా శ్రీనివాస్ నకిరికంటి నాగరాజు అంజయ్‌కుమార్ చంద్రలీల వెంకటలక్ష్మీ నాదెళ్ల లీలావతి గౌతమి ఉప్పెల జ్యోతి నాగలక్ష్మీ కనకశ్రీ సాయన్న రాఘవయ్య రాయల రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు



సీసీఐ అధికారులకు మేయర్ మూడు గణేష్ స్పష్టమైన సూచన
-మంజిత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో
పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/సుజాతనగర్: సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో ఉన్న మంజిత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో భారత పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కొత్త గూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని మేయర్ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా మేయర్ మూడు గణేష్ మాట్లాడుతూ ఈ ఏడాది పత్తిలో తేమ శాతం చాలా తక్కువగా ఉండటంతో పాటు పత్తి దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని తెలిపారు. ఇప్పటికే పెట్టుబడుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు బయట మార్కెట్ లో క్వింటాలు కు రూ.9,000/కు పైగా ధర...సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి ధర క్వింటాలుకు రూ.8,667 ఉండగా, బయట మార్కెట్‌లో క్వింటాలుకు రూ.9,000కు పైగా ధర పలుకుతోందని మేయర్ తెలిపారు. రైతులు పత్తి విక్రయించే సమయంలో అందుబాటులో ఉన్న ధరల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. రైతులకు నిబంధనల ప్రకారం మద్దతు ధర అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకువచ్చే రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయవద్దని మేయర్ స్పష్టం చేశారు. పత్తి నాణ్యత పరిశీలన, తూకం, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసినా, కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రై పత్తి సాగులో దిగుబడులు తగ్గిన ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు న్యాయం జరగడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రైతులు పత్తిని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. రైతులకు మద్దతు ధర అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, 21వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, సీసీఐ బయ్యర్ సింహాద్రి నాయుడు, సీపీఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దశ్రు, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు మండల సహాయ కార్యదర్శి లావుడియా గోపి, మాజీ ఎంపీటీసీ కసనబోయిన భద్రం, భూక్యా తేజ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందేలా కృషి చేస్తాం



గాంధీనగర్‌లో పర్యటించిన పినపాక ఎమ్మెల్యే,
ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం

ప్రజాపక్షం/మణుగూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తూ, ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గాంధీనగర్ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి అంశాలపై స్థానికులతో చర్చించారు. అదేవిధంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి అర్హులైన పేద కుటుంబాల వివరాలు, ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితులు, ఇళ్ల మంజూరు తదితర అంశాలపై స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం, మణుగూరు పట్టణ అభివృద్ధిని వేగవంతం చేయడం తన లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

20 వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్ఎస్ మహా ధర్నా



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. మణుగూరు మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వార్డుల్లో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గుంతలు లేని రహదారులను నిర్మించాలని, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రమైన వార్డులుగా తీర్చిదిద్దాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దుమ్ము ధూళిని నియంత్రించే చర్యలు చేపట్టాలని, వైకుంఠధామాలు, శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ఈ కనీస మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, మున్సిపాలిటీలోని 20 వార్డుల ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మేలు జరిగిందని ప్రజలు పేర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, మణుగూరు టౌన్ అధ్యక్షులు కుంట లక్ష్మణ్, నూకారపు రమేష్, మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు, టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ముత్యం బాబు, వట్టం రాంబాబు, సీనియర్ నాయకులు యాదగిరి గౌడ్, ఎడ్ల శ్రీను, తురక రామకోటి, ముద్దంగుల కృష్ణ, మీసాల ఆవుల నరసన్న, అడపా అప్పారావు, యువ నాయకులు బోశెట్టి రవి ప్రసాద్, జక్కం రంజిత్, మణుగూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సురేష్ తదితర నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు చేరుకుని, కుర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

సీపీఐ సీనియర్ సభ్యురాలు సృజనమ్మ మృతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని సదాశివపురం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు చిర్రా వెంకయ్య సతీమణి, పార్టీ సీనియర్ సభ్యురాలు సృజనమ్మ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పార్టీ నాయకులతో కలిసి సృజనమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిర్రా వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, మండల కౌన్సిల్ సభ్యులు పాలపాటి అశోక్, చిర్రా ప్రసాద్, కాశబోయిన అయోధ్య తదితరులు నివాళులర్పించారు.

బస్టాండ్ వద్ద బస్సు-బైక్ ఢీ..

యువకుడికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన గోపి అనే యువకుడు బైక్‌పై పైనంపల్లి నుంచి నేలకొండపల్లికి వస్తుండగా, ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుంచి రోడ్డుపైకి వచ్చింది. ఈ క్రమంలో బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో గోపికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం అనంతరం బస్సు డ్రైవర్‌కు, బాధితుడి వర్గానికి మధ్య వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో బస్సులోని ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తపాలా శాఖ అందిస్తున్న వివిధ పథకాలు, బీమా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం సౌత్ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ పి.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం నేలకొండపల్లి సబ్ పోస్టాఫీసులో సబ్ పోస్ట్ మాస్టర్ జి. కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్‌ఐ) కింద మంజూరైన రూ.3.95 లక్షల మరణ బీమా క్లెయిమ్ మొత్తాన్ని నామినీ వాకదాని ఇందిరకు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోస్టాఫీసు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ కనకాచారి, మెయిల్ ఓవర్సీర్ ఎం.లక్ష్మణ్ , పోస్టుమ్యాన్ ఉపేందర్ రెడ్డి, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : అర్హత కలిగిన పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చెరువుమాధారం గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రానున్న ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కార్యక్రమ కన్వీనర్ మల్లెబోయిన గోవిందరావు, కో కన్వీనర్ సయ్యద్ మోహినుద్దీన్, సూరెపల్లి జ్ఞానరత్నం, కొండా హర్షవర్ధన్, గెల్లా చక్రపాణి, ఏపూరి సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ కందరబోయిన గోపి, గెల్లా గిరిపాల్గొన్నారు.

అటువైపు వెళ్లేది ఎలా...



ప్రజాపక్షం/మణుగూరు: రోడ్డుమీద సగానికి సగం ఇసుక కంకర డంపింగ్ చేసిన కాంట్రాక్టర్... రాకపోకలకు తీవ్ర అంతరాయం... శ్రీవిద్య డిగ్రీ కాలేజ్ రోడ్డు వైపు ఇసుక మేటలు.. కంకర మేటలు డంపింగ్ చేసిన దృశ్యాలు... పక్కనే చెత్త చెదారం నిల్వ ఉన్న చోటు.. అటువైపు వెళ్ళాలంటే దుర్గంధం... పైగా ఎక్కడో రోడ్ల నిర్మాణం కొరకు కాలేజీ పక్కనే ఇసుక కంకర డంపింగ్ చేయడం వలన వెళ్లలేని పరిస్థితి. గత పది రోజుల నుంచి ఇక్కడే దర్శనమిస్తున్నాయి. రోడ్డు పనుల నిర్మాణం జరుగుతుందా.. ఆగిపోయిందా అనేది సందేహం. తొందరగా అక్కడ నుంచి ఇసుక కంకర ఎత్తుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు...

నీటి వనరుల దుర్వినియోగంపై ఉక్కుపాదం



-పాలడుగులో అధికారుల తనిఖీలు...
అక్రమ కనెక్షన్లు తొలగించాలని ఆదేశం
-నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రజాపక్షం/వైరాः త్రాగునీటి వనరుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఖమ్మం జిల్లా వైరా మండలం పాలడుగు గ్రామంలో పంచాయతీ బోర్‌కు ఉన్న అక్రమ నీటి కనెక్షన్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్ టోల్‌ఫ్రీ నెంబర్ 1916కు గ్రామానికి చెందిన గుండెపోగు వేణు చేసిన ఫిర్యాదుపై స్పందించిన అధికారులు శుక్రవారం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి నీటి వనరులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంట్రీ ఏఈ కృష్ణచైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ గ్రిడ్ ఏఈ వసంత్ పాల్గొన్నారు. గ్రామంలోని పంచాయతీ బోర్‌ను పరిశీలించిన అధికారులు దానికి ఉన్న అక్రమ నీటి కనెక్షన్‌లపై ఆరాతీశారు. ప్రజల అవసరాల కోసం ఉద్దేశించిన నీటి వనరులను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు అక్రమ కనెక్షన్లను తక్షణమే తొలగించాలని, ఆదేశాలను పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని బావులను పరిశీలించిన అధికారులు వాటిలో పేరుకుపోయి చెత్తను తొలగించి, బ్లీచింగ్ పౌండర్ వేయాలని సూచించారు. బావుల నీటిని దుస్తులు ఉతకడం, ఇంటి పనిముట్లను శుభ్రం చేసుకోడం వంటి అవసరాలకే వినియోగించాలని, త్రాగునీటిగా ఉపయోగించరాదని స్పష్టం చేశారు. నీటి వనరుల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అలాగే గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును తనిఖీ చేసిన అధికారులు నెలకు కనీసం మూడుసార్లు తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. ట్యాంకును శుభ్రపరించిన ప్రతిసారి ఫొటోలు తీసి గ్రామ వాట్సాప్ గ్రూపులో షేర్ చేయాలని సూచించారు. తద్వారా ట్యాంకు నిర్వహణలో పారదర్శకత పెంపొందడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కలుగుతుందని తెలిపారు. తాగునీటి వనరుల పరిరక్షణ, ప్రజలకు పరిశుభ్రమైన నీటి సరఫరా విషయంలో సంబంధిత సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పేర్కొన్నారు. పంచాయతీ బోర్‌కు ఉన్న అక్రమ కనెక్షన్ల తొలగింపుతో పాటు బావులు, వాటర్ ట్యాంకుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గద్దల నర్సింహారావు, బిఆర్ఎస్ గ్రామశాఖ, మండల సమన్వయ కమిటీ అధ్యక్షుడు రాయల కిరణ్, కార్యదర్శి వేము కిరణ్‌కుమార్, గుండెపోగు వేణు, పల్లెపోగు భాను, మోదుగు సిల్వరాజు, మోదుగు రవి, పుట్టా మస్తాన్, గుండెపోగు చలపతి తదితర గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ



ప్రజాపక్షం/వైరాः వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో వన మహోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పరసన్ డాక్టర్ కాపా చంద్ర కళ మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వన మహోత్సవం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని, కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. వార్డులో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకట్రావు, వార్డు ప్రజలు దేవభక్తుని రవీంద్ర, లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, విజయలక్ష్మి, కల్పన, సుశీల, లక్ష్మి రాజ్యం, కృష్ణవేణి, సంధ్య, ఉప్పలమ్మ, ఆర్‌పి ఫాతిమా, లక్ష్మణరావు, జవాన్ శ్రీను, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జవహర్ ఎత్తిపోతల పథకం పనులు



ప్రజాపక్షం/మధిరः మధిర మండలం వంగవీడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో రూ.630.30కోట్లతో నిర్మితమవుతున్న జవహర్ ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మధిర నియోజకవర్గ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తయితే మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం మెరుగుపడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను గుర్తించి, వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో భట్టివిక్రమార్క చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రైతాంగానికి అండగా నిలుస్తాయని అన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సమస్యలు తగ్గి వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నిర్సంహారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, టౌన్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో అనర్థాలు

వాగులు, వంకలు, చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలు



ప్రజాపక్షం/కల్లూరుः మండల పరిధిలోని పలు గ్రామాలలో కోళ్ల వ్యర్థాలు, పేగులు, కోడి తల, కాళ్లు అవయవాల తో గ్రామాల్లో రోడ్డు వెంట వేయడంతో రాకపోకల సమయంలో దుర్వాసన కంపు కొడుతున్న క్రమంలో కోళ్ల వ్యర్థాలు తో అనేకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని దీనిని అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండల పరిధిలోని చెన్నూరు, పెద్ద కోరుకొండి ,చిన్న కోరుకొండి, ముచ్చవరం, బత్తులపల్లి, పేరువంచ, కల్లూరు తదితర ప్రాంతాలలో కోళ్ల వ్యర్థాలు తో దుర్వాసన వలన అనేకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని దీనిని అరికట్టేందుకు ప్రణాళికలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు గ్రామీణ ప్రాంత అధికారులను కోరుతున్నారు. అవయవ వ్యర్థాలు చెరువులు, వాగులు లో వేయటం వలన అదే చెరువులో వాగుల్లో నీరు కలుషితం కావడం వలన పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించే విధంగా చూడాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీ ఓ సురేష్ బాబును వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



ప్రజాపక్షం/మధిరः ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాలను పట్టభద్రుదల ఓటు ద్వారా ఎండగట్టాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుదల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మధిర స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరాకు విడుదల చేస్తామన్న డిఏల సంగతేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్, మెగా డిఎస్సీ, ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వంటి హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఏలు, పిఆర్సీ, పెండింగ్‌లో ఉండగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాల చెల్లింపుల్లోను సమస్యలు ఎదురవుతున్నాయని విమర్శించారు. ఉద్యోగులు నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.

డబుల్ రోడ్డు శంకుస్థాపనకు ఏర్పాట్లు



ప్రజాపక్షం/మధిరः మధిర నియోజకవర్గ పరిధిలోని సిరిపురం–మిట్టగూడెం డబుల్ రోడ్డు(రహదారి) నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన స్థలాన్ని మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ పరిశీలించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక కృషితో మధిర నియోజకవర్గంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు వరదలా మంజూరయ్యాయి. ఇందులో భాగంగానే సిరిపురం–మిట్టగూడెం రహదారి పనుల కోసం ప్రభుత్వం రూ.21కోట్లు కేటాయించింది. ఎన్నో ఏళ్లుగా గుంతలమయంగా మారి ఆధ్వానంగా తయారైన ఈ రోడ్డు సమస్యను తీరుస్తూ డబుల్ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనకు అధికార యంత్రాంగం, కాంగ్రెస్ శ్రేణులు ఏర్పాటు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే శంకుస్థాపన జరగబోయే స్థలాన్ని పారుపల్లి విజయకుమార్ స్వయంగా పరిశీలించి పనుల నాణ్యత, ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రాన్ని వినియోగించుకోండి



ప్రజాపక్షం/కల్లూరుः కల్లూరులోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపాలిటీ కమిషనర్ ప్రజలను తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఖమ్మం, వరంగల్, నల్గొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ జి.సాయి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నమోదుకు డిగ్రీ ఉత్తీర్ణత ధ్రువ పత్రం ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్, తో దరఖాస్తులు స్వీకరణ చేస్తున్నట్లు చివరి తేదీ నవంబర్ 6. 2026. కావున అర్హులైన పట్టభద్రులు పత్రాలతో మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని సంప్రదించి గడువులోగా వారం నెంబర్, 18, సమర్పించి తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కమిషనర్ విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు.

కల్లూరులో ఖరీఫ్ కోతలు ప్రారంభం



ప్రజాపక్షం/కల్లూరుः కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, బోడిమల్లి , వాచ్య నాయక్, తండ ముచ్చవరం, లింగాల , చంద్రు పట్ల తదితర గ్రామాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ సీజన్ కు 30 వేల ఎకరాలకు వరి నాట్లు వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారిని రూపా తెలిపారు. వర్షా బావ పరిస్థితుల, చీడ పేడలు వలన ఈ సంవత్సరం దిగుబడి తగ్గుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు గురుకుల విద్యార్థి

-రాష్ట్రస్థాయిలో ప్రతిభ..వరుణ్ ఆదిత్యకు అభినందనలు



ప్రజాపక్షం/బోనకల్ः మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల కళాశాల, బోనకల్‌కు చెందిన విద్యార్థి వరుణ్ ఆదిత్య జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటాడు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రదర్శనతో జాతీయ పోటీలకు అర్హత సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచాడు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపిసీ చదువుతున్న వరుణ్ ఆదిత్య ఈ నెల 16న రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 19 ఎస్‌జిఎఫ్ చెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సిఓ సిహెచ్ రాంబాబు, డిసిఓ కళాశాల ప్రిన్సిపాల్ సుష్మ, వ్యాయామ ఉపాధ్యాయులు పి వెంకట్రావు, పి వెంకటేశ్వర్లు, అధ్యాపక బృందం వరుణ్‌ఆదిత్యను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి కళాశాలకు, ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శంకర్ దాదా పవర్ లిఫ్టింగ్

- ప్రపంచ పవర్ లిఫ్టింగ్‌లో భద్రాద్రికి పతకాలు
- 73 ఏళ్ల వయస్సులో డివి శంకర్ రావు అసాధారణ ప్రతిభ
- బైపాస్ సర్జరీని అధిగమించి ప్రపంచ వేదికపై మెరిసి
- క్లాసిక్‌లో కాంస్యం... ఎక్విప్డ్‌లో రజతం
- ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు కైవసం
- ముంచెత్తుతున్న ప్రశంసలు





ప్రజాపక్షం/భద్రాచలం : వయస్సు కేవలం అంకె మాత్రమేనని, పట్టుదల ముందు ఆరోగ్య సమస్యలు సైతం అడ్డంకులు కాలేవని భద్రాచలానికి చెందిన విశ్రాంత స్టేయ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగి డివి శంకర్ రావు నిరూపించారు. 73 ఏళ్ల వయస్సులో అమెరికాలో జరిగిన ప్రపంచ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రెండు పతకాలను సాధించి ఇండియాకు గర్వకారణంగా నిలిచాడు. దీంతో తెలంగాణ రాష్ట్రం ప్రజలతో పాటు ప్రత్యేకించి భద్రాచలం గడ్డ మురిసిముద్దవుతోంది. అమెరికాలోని నెవాడా రాష్ట్రం రెనో నగరంలోని సిల్వర్ లెగసీ బాల్‌రూమ్‌లో అక్టోబర్ 22న జరిగిన వరల్డ్ ఫవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మాస్టర్ 4 (ఎం4) 74 కిలోల విభాగంలో శంకర్‌రావు రజత పతకాన్ని దక్కించుకున్నారు. అంతకంటే ముందు అక్టోబర్ 15న జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యాన్ని సైతం కైవసం చేసుకున్నారు. వారంరోజుల వ్యవధిలోనే రెండు విభాగాల్లో స్వేతదేశంలో ప్రపంచ పతకాలు సాధించడం ఆయన పట్టుదల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఆరోగ్య సవాళ్లను జయించి : శంకర్ రావుకు 2012వ సం.లో గుండెకు బైపాస్ సర్జరీ అయ్యింది. ఆ తర్వాత కూడా క్రమశిక్షణతో సాధనను సాగించి అంతర్జాతీయ స్థాయిలో విజయాలు అందుకున్నారు. వయస్సు పెరిగినకొద్దీ ఆత్మవిశ్వాసం,అకుంఠిత దీక్షతో ప్రపంచ వేదికపై సత్తా చాటి రెండు పతకాలను సాధించడం క్రీడా ప్రపంచాన్ని ఆకట్టుకుంది. ఇప్పటి వరకు ప్రపంచస్థాయిలో ఆయన సాధించిన పతకాల సంఖ్య 10 చేరడం విశేషం.



స్ఫూర్తిదాయక విజయ గాథ : ఈ విజయం కేవలం వ్యక్తిగత ఘనత మాత్రమే కాకుండా వృద్ధాప్యంలోనూ ఆరోగ్యకరమైన జీవనశైలితో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని చాటుతోంది. ఆరోగ్య సమస్యలను అధిగమించి జీవితంలో ముందుకు సాగాలనే ప్రతీ ఒక్కరికీ శంకర్ రావు విజయగాథ స్ఫూర్తిగా నిలుస్తోంది.

శంకర్ దాదా ఎంబిబిఎస్ సినిమాలో కథానాయకుడు చిరంజీవిని ఊహా ఊహా అంటూ ఏవిధంగా జైజైలు కొట్టారో... ఇప్పుడు శంకర్ రావును కూడా పలువురు శంకర్ దాదా పవర్ లిఫ్టింగ్ అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

నేలను కాపాడుకుందాం.. తక్కువ నీటితో పండే పంటలు సాగు చేద్దాం

-వరి సాగుకు ప్రత్యామ్నాయంగా
అపరాల పంటలపై దృష్టి సారించాలి
-కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్



ప్రజాపక్షం/నేలకొండపల్లి : నేల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, నీటి వినియోగాన్ని తగ్గించే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్ సూచించారు. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా అపరాల పంటలను సాగు చేయడంతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని పిలుపు నిచ్చారు. నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామంలో శుక్ర వారం నిర్వహించిన ఖేతీ బచావో అభియాన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేల సారాన్ని కాపాడుకునేందుకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. భూసార పరిరక్షణతో పాటు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండించే పంటలను ఎంపిక చేసుకోవాలని, అపరాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఏడీవీ వాణి, మండల వ్యవసాయ అధికారి ఎం. రాధా, ఆయిల్‌ఫెడ్ ప్రతినిధి సాయినారాయణ, సర్పంచ్ దండా రంగయ్య, ఉప సర్పంచ్ రాసాల నవీన్, ఏఈవోలు ధాత్రి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న కమీషనర్‌ను సస్పెండ్ చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : హైకోర్టు ఆదేశాలను దిక్కరిస్తున్న, 2019 మునిసిపాలిటీ చట్టంపై అవగాహన లేని అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు సోయం సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వ హించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచలోని సర్వే నెంబర్ 444/1/31 మూడు ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి రెవిన్యూ రికార్డుల ప్రకారం నాటి నుండి నేటి వరకు ధరణి, భూ భారతి తదితర రెవిన్యూ రికార్డుల ప్రకారం నేటి వరకు ఎర్రబోయిన ముత్తయ్య, తండ్రి వెంకయ్య భూమిగా 09/09/2009 తేదీన సంభంధిత అధికారులు పంచనామా చేసి హద్దులు గుర్తించి ఎర్రబోయిన వెంకటేశ్వర్లుకు స్వాధీన పరిచారని చెప్పారు. కొంతమంది అక్రమార్కులు మునిసిపల్ అధికారుల అండదండలతో అట్టి భూమిలో కేసిఆర్ నగర్‌గా నామక రణం చేసి భారీ భవన నిర్మాణాలు చేశారని అన్నారు. నిర్మాణాలను వ్యతిరేకిస్తూ సదరు భూ యాజమాని డబ్ల్యూపిఎంపి నెంబర్ 33019 ఆఫ్ 2010 స్టేటస్‌కో ఆర్డర్ తీసుకొచ్చారని తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా మునిసిపల్ అధికారులు కేసిఆర్ నగర్‌కు ఎలాంటి అను మతులను ఇవ్వలేదని తెలిపారని ఆరోపించారు. ప్రస్తుతం విధులు నిర్వ హిస్తున్న కొత్తగూడెం మునిసపల్ కార్పోరేషన్ కమీషనర్ అక్రమార్కు లకు కొమ్ముకాస్తున్నారని, భూయాజమాని సమర్పించిన ఆర్జీలను ఎంత మాత్రం పట్టించుకోకుండా సొంత నిర్ణయాలతో పలువురు అధికా రులు కుమ్మక్కై, ఏకమై ఆదివాసీ భూ యజమాని ఎర్రబోయిన వెంకటే శ్వర్లును భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. 2019 మునిసిపాలిటి చట్టంపై అవగాహన లేకుండా అధికార దుర్వినియోగా నికి పాల్పడుతున్న మునిసిపల్ అధికారుల తీరును ఉన్నతాధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి ఏదైతే పట్టాదారి భూమిలో అక్రమ కట్టడాలకు అనుమతి లిచ్చిన కమీషనర్‌పై చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్‌లో ఆదివాసీలను, నిరుపే దలను ఇబ్బందులకు గురి చేస్తున్న మునిసిపల్ అధికారుల తీరును నిర సిస్తూ త్వరలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మునిసపల్ కార్యాలయ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘం పొలిటికల్ జేఏసి కన్వీనర్ వాసం రామకృష్ణ, జిఎస్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ఆరెం ప్రశాంత్, జిల్లా నాయకులు ఈసం ఉదయ్, భూ పట్టాదారు వారసులు కమీషనర్ బాదితుడు ఎర్రబోయిన మోహన్ క్రిష్ణ, వాసం రాముల, ఎర్రబోయిన లక్ష్మి, ఎర్రబోయిన సుభద్ర, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై కొత్తగూడెం మునిసిపా లిటి కమీషనర్ కే. సుజాతను వివరణ కోరగా అసైన్డ్ భూమిని ఇతరు లకు విక్రయించారని 2016, 2017 సంవత్సరంలో అప్పటి ఆర్డిఓ విచారణ చేసి రద్దు చేసినట్లు తెలిపారు. అసైన్డ్ భూముల్లో భవన నిర్మాణాలకు మేము ఎటువంటి అనుమతులను ఇవ్వలేదని తెలిపారు.

జనగణన ఖచ్చితత్వంతో నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ



ప్రజాపక్షం/భద్రాచలం : జనగణన ఖచ్చిత త్వంతో పారదర్శకంగా నిర్వహించాలని సబ్ కలె క్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ అన్నారు. ఈనెల22,23 తేదీల్లో నిర్వహించిన ఫేజ్ 2 రెండురోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం నాటితో ముగిసింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమ రేటర్లు సూపర్వైజర్లు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జనాభా గణన పూర్తి చేయాలన్నారు. 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రజల నుండి సరైన సమా చారాన్ని సేకరించి నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాదరాబాద్‌కు చెందిన జనగణన శాఖ ట్రైనర్లు రవీందర్ నాయక్, శివ శిక్షణ ఇవ్వగా కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, జెడ్పీ సిఇఓ నాగలక్ష్మి జిల్లా పంచాయితీ అధికారి అనూష శంభు ప్రసాద్, భద్రాచలం తహశీల్దార్ రవికుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంభుని గూడెంలో వైద్యశిబిరం



ప్రజాపక్షం/గుండాల : గుండాల ప్రాథమిక వైద్య కేంద్రం ఆద్వర్యంలో శుక్రవారం మండల పరిధి లోని శంభునిగూడెం గ్రామంలో ఉచిత వైద్యశిభిరం నిర్వహించారు. జ్వర లక్షనాలు ఉన్నవారికి రాపిడ్ డయాగ్నాస్టిస్ పరీక్షలు నిర్వహించి జ్వర పీడితు లకు మందులను అందించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి సూపర్‌వైజర్ రాజు మాట్లాడుతూ ,సీజ నల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ప్రతి ఒక్కరు తమ తమింటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలని నీటి నిలువల ద్వారా దోమలు వృద్ధి చెంది దోమ కాటు ద్వార డెంగ్యూ, మలేరియా జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు.జ్వర లక్షనాలు ఉన్నావారు వెంటనే దగ్గరలోని ప్రాథమిక వైద్యకేంద్రానికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకునేందుకు డెంగ్యూ ,మలేరియా పరీక్షా కిట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. నీటి గుంటల్లో దోమల లార్వాను నాశనం చేసే తిమోపాస్ వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితి సెక్రెటరి శరత్,ఎంఎల్‌టిఎస్,సత్యం, బిక్షా, రాఘువులు, ఎఎన్ఎం ధనమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత



ప్రజాపక్షం/గుండాల : గుండాల లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో శుక్రవారం గిరిజన విద్యార్థుల వసతి గృహాలకు నిత్యావసర సరుకులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం లయన్స్‌క్లబ్‌జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉజ్వలకుమార్ ముఖ్యఅథిదిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడు తూ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యాభివృద్ధికి సమాజంలో ప్రతిఒక్కరు తమ వంతు సహకారం అందిం చాలని కోరారు. వారి విద్యాబ్యాసానికి తోడ్పటుసామాజిక బాద్యతగా తీసుకోవాలని సూచిం చారు. ఇలాంటి సేవాబావాన్ని ప్రతిఒక్కరు పెంపొందించుకోవాలని విద్యార్థుల అభ్యన్నతికి దోహదపడాలనికోరారు. కార్యక్రమంలో గోవిందనర్శింహారావు, విమల్, పాల్గొన్నారు.

సాగుభూమి సంరక్షణపై అవగాహన



ప్రజాపక్షం/పాల్వంచ : రైతులు అధిక దిగుబ డుల కోసం, భూ సంరక్షణ కోసం భూ సార పరీ క్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధి కారి పాయం శంభో శంకర్ అన్నారు. పాల్వంచ క్లస్టర్ పరిధి పునుకుల పంచాయితీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ, తేదీ నుండి నవంబర్ 30 వరకు నిర్వహించే ఖేత్ బచావో అభియాన్, స్వస్థ్ ధరా, సమృద్ధ్ కిసాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూ సంరక్షణ, నేల ఆరోగ్యంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి జి. నరేష్, పునుకుల పంచాయితీ కార్యదర్శి బాబూరావు, సర్పంచ్ వజ్జా క్రిష్ణవేణి, ఉప సర్పంచ్ మాలోత్ వీరు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో పట్టభద్రుల ఓటరు నమోదు

ప్రజాపక్షం/సత్తుపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మీ సేవ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు గాదే చెన్నారావు,కమల్ పాషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు ఏఎన్ఎం కోర్సులో ప్రవేశాలు

ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ పరిధిలోని గిరిజన ఏఎన్ఎం శిక్షణ పాఠశాల్లో రెండేళ్ల కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఏ పిఓ రాహుల్ తెలిపారు. ఇంటర్ పాసై 17 ఏళ్ల నిండిన గిరిజన మహిళలు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 28వ తేది సాయంత్రం ఐదు గం.లలోపు భద్రాచలం శిక్షణ పాఠశాల్లో సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం 9490370905, 9963315323, 9000983664 నెంబర్లను సంప్రదించాలన్నారు.

హక్కులను హరిస్తున్న మోడీ సర్కార్



-దేశంలో రాజ్యాంగ వ్యవస్థల విచ్ఛిన్నం
-ఏఐటియుసి సమావేశంలో దండి సురేష్

ప్రజాపక్షం/ఖమ్మం : కార్మిక వర్గం అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ సర్కార్ హరించివేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ వర్గాలకు ఈ ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. ఏఐటియుసి ఖమ్మం జిల్లా సమితి సమావేశం శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులకు భంగం కలిగిస్తుందని సమ్మె హక్కుతో పాటు అనేక హక్కులను కార్మికులు కోల్పోతున్నారన్నారు. హక్కుల పరిరక్షణకు పోరాటమే మార్గమని దండి సురేష్ తెలిపారు. మారిన ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వేతనాలు అందడం లేదని దేశంలో మునుపెన్నడు లేని స్థాయిలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని అందుకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదన్నారు. సంఘటిత అసంఘటిత రంగాల్లో శ్రమ దోపిడీ జరుగుతుందని దీనికి తోడు ప్రభుత్వం నియమాకాలను నిలిపివేసి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని సురేష్ ఆరోపించారు. కనీస వేతనం రూ. 26వేలు ప్రతినెల ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని సైతం తన స్వప్రయోజనాల కోసం వాడుకుంటుందన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని తమ వ్యతిరేక ఓట్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఎన్నికల కమిషనర్‌ను తొలగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్టిసి గుర్తింపు ఎన్నికల్లో ధనంతో గెలవాలని చూసిన వారికి కార్మికులు సరైన రీతిలో సమాధానం చెప్పారన్నారు. ఎంప్లాయీస్ యూనియన్‌ను గెలిపించిన కార్మిక వర్గానికి సిపిఐ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని, రానున్న సింగరేణి గుర్తింపు ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు గాదె లక్ష్మి నారాయణ, నిమ్మటూరి రామకృష్ణ, ఏనుగు గాంధీ, పగడాల మల్లేష్, సిహెచ్ సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్, పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, మల్లేష్, శ్రీను, బోడా వీరన్న పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే మన లక్ష్యం



-ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి
-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు

ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: పోలియో రహిత సమాజ నిర్మాణ మే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు పిలుపునిచ్చారు. ఆక్టోబర్ 24న ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడు తూ పోలియో వ్యాధి నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పోలియో వైరస్ ప్రధానంగా కలుషితమైన ఆహారం, తాగునీరు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు. అపరిశుభ్రత, చేతులు సరిగ్గా కడుక్కోకపోవడం వల్ల వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని, తీవ్రమైన సందర్భాల్లో శాశ్వత పక్షవాతం ఏర్పడుతుందని వివరించారు. పోలియోను పూర్తిగా నివారించేందుకు జాతీయ టీకాల షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు పోలియో చుక్కలు, అవసరమైన టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పిల్లలకు టీకాలు వేయించడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ కల్పించడంతో పాటు పోలియో రహిత సమాజ నిర్మాణానికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. భారతదేశంలో 2011 నుంచి ఇప్పటి వరకు ఒక్క పోలియో పాజిటివ్ కేసు నమోదు కాలేదని, తెలంగాణ రాష్ట్రంలో 2007 తర్వాత పోలియో పాజిటివ్ కేసు నమోదు కాలేదని తెలిపారు. ఈ విజయాన్ని కొనసాగించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలియో టీకాలపై అపోహలకు తావివ్వకుండా ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని డాక్టర్ రామారావు కోరారు. పోలీ యో నిర్మూలనలో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి చిన్నారికి టీకాలు అందేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

వరి పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం విప్పలమడక గ్రామంలో వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటలో ప్రధానంగా బ్యాక్టీరియా ఎండకు తెగులు, ఆకు చుట్టు పురుగుల ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. ఈ తెగుళ్ల నివారణకు సంబంధింత వ్యవసాయ సిబ్బంది సూచించిన విధంగా ఎకరాకు ప్లాంటోమైసిన్ 75100 గ్రాములు బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు, సైక్లానిలిప్రోలు 160 మిల్లీ లీటర్లు ఆకు చుట్టు పురుగుల నివారణకు వినియోగించాలని రైతులకు సూచించారు. సేంద్రీయ ఎరువులతో నేల ఆరోగ్యానికి రక్షణ కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు నేల ఆరోగ్యం, పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు. సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని, సాగు ఖర్చులను తగ్గించుకుంటూ మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. వరి పంటపై ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త ఫణిశ్రీ, మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్, ఏఈవో యశ్వంత్ పాల్గొన్నారు. రైతులు వీరపునేని చెన్నకేశవులు, ఎడ్లపల్లి నాగేశ్వరరావు, మన్నెం రమేష్, గరిడేపల్లి సత్యనారాయణ, అంసురి తిరుపతయ్య, గరిడేపల్లి ప్రతాప్, కొండపనేని రమేష్, కొలికొండ వీరభద్రం, గరిడేపల్లి కృష్ణ, పోతినేని కొండయ్య, ఆకుల ప్రసాద్, చల్లా తిరుపతిరావు, బూరుగు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా ప్రభుత్వ పాఠశాల వాష్‌రూమ్‌కు మరమ్మతులు



ప్రజాపక్షం/వైరా: వైరాలోని ప్రభుత్వ పాఠశాలలో చాలాకాలంగా మరమ్మత్తులకు నోచుకోని వాష్‌రూమ్‌కు అవని క్లబ్ సభ్యులు మరమ్మత్తులు చేయించి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాష్‌రూమ్ సమస్యను అవని క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకురావడంతో వారు వెంటనే స్పందించారు. వాష్‌రూమ్‌కు అవసరమైన ప్లాస్టరింగ్ పనులతో పాటు డోర్ల మర్మమత్తులు చేపట్టి కిటికీలు, వెంటిలేటర్‌ను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా వాష్‌రూమ్ సౌకర్యాలను మెరుగుపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న వాష్ రూమ్ సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించి మరమ్మత్తులు చేయించిన అవని క్లబ్ సభ్యులను అభినందించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి సామాజిక సేవలో భాగంగా ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్‌సిఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు, జిల్లా జిఈటి కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, అవని క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ, సెక్రెటరీ సుగ్గల మాధవి, పువ్వాళ్ళ జయశ్రీ, రాయల విజయలక్ష్మి, వనమా సునీత, నాళ్ల నాగమల్లేశ్వరి, వడ్లమూడి విజయలక్ష్మి, ఈడుపుగంటి రత్నకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో గుండెపోటుతో విద్యార్థి మృతి

-పలువురు సంతాపం



ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగరానికి చెందిన యువతి అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగ అన్వేషణలో ఉండగా గుండెపోటుకు గురై మరణించిన విషాద ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ అధ్యక్షులు నల్లమల ఆనంద్ కుమార్తె అక్షిత (26) అమెరికా దేశంలోని న్యూయార్క్ సిటీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ యంఎస్ పూర్తి చేసింది. ఉద్యోగ అన్వేషణలో ఉండగా శుక్రవారం తెల్లవారుజామున ఆమెకు గుండెపోటు రావడంతో తోటి విద్యార్థులు, స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. అక్షిత మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆమె అకాల మృతివార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె మృతదేహాన్ని ఖమ్మంకు తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్షిత మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, పలువురు వ్యాపారులు అక్షిత మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ముదిగొండ: మండలంలోని రైతులు ముదిగొండ విశాల సహకార పరపతి సంఘం ద్వారా అందిస్తున్న పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండ స్వామి ఓ ప్రకటనలో సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన అర్హులైన రైతులు సంఘం ద్వారా కొత్త పంట రుణాలను పొందవచ్చని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో రైతులకు పంట రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, సాగు అవసరాలకు ఆర్థికంగా తోడ్పడేందుకు సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇప్పటికే ముదిగొండ విశాల సహకార పరపతి సంఘం ద్వారా పంట రుణాలు పొందిన రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేయించుకునే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

వేదిక సైనాకు జన్మదిన శుభాకాంక్షలు



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, కల్పన దంపతుల కుమార్తె వేదిక సైనా జన్మదినం సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. వేదిత సైనా ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఎదగాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

బ్రదర్ అనిల్‌కుమార్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఠాగూర్ విద్యాలయంలో నిర్వహించిన సువార్త మహాసభలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రదర్ అనిల్‌కుమార్‌ను వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో పాటు పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, 1వ వార్డు కౌన్సిలర్ మోరు శ్రీకాంత్, ఆంధ్రప్రభ మేనేజర్ దాసరి శ్రీనివాసరావు, మామిడాల నవీన్‌కుమార్, కొక్కిరేణి లింగయ్య, తుమ్మల చిన్ని, బ్రదర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెర కృష్ణకు పరామర్శ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామానికి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ కిన్నెర కృష్ణ తనయుడు కిన్నెర రాఘవ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, 8వ వార్డు కౌన్సిలర్ చిలకా కోటయ్య, 11వ వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, తిరుపతి శ్రీను, దొంతెబోయిన చింతయ్య, గోపి తదితరులు కృష్ణ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా కిన్నెర రాఘవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కిన్నెర కృష్ణను పరామర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రజాపక్షం/అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, పనితీరు, నిర్వహణ తీరును సమీక్షించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలపై సత్వరమే స్పందిస్తూ, అందిన ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం సీఐ సీహెచ్ ఎల్లయ్య, ఎస్ఐ ఈ రాజేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.